# సంపాదకీయం

బుధవారం 30-07-2025

## పులుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం !

దేశంలో పర్యావరణంపై ఆసక్తి, శ్రద్ధ లేకుండా పోతోంది. మానవజాతి పెరుగుతున్నా కొద్దీ పక్కనున్న ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. అడవులను నరికివేస్తూనే..అడవుల్లోని జంతుజాలాన్ని కూడా ఉనికి లేకుండా చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక జంతుజాతులు నశించాయి. మనం బతికితే చాలు...మిగతా ఏమయితే ఏమిటన్న ధోరణి ప్రబలింది. ఈ క్రమంలో అడవుల విధ్వంసంతో జంతుజాలం నశించింది. ప్రపంచవ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట 29 జులై రోజున 'అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్ డే' పాటించడం ఆనవాయితీగా మారింది. 2010 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025 అంతర్జాతీయపులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామరస్యంగా సహజీవనం చేయడం అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణ బాధ్యతలను వివరించడం జరుగుతుంది. ఇటీవల ఆదిలాబాద్ కవ్వాల్ రక్షణకు జివో 49ని తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. కానీ అందరూ ఒక్కటై దానిని అమలు చేయకుండా పక్కన పెట్టేయించారు. ఇది అమలు చేయడం ద్వారా పులుల సంరక్షణకు ప్రభుత్వం పూనుకుంది. కానీ గిరిజనుల జీవనానికి ఇది అడ్డంకిగా మారిందన్న ఆందోళనతో పులుల రిజర్వ్ ఫారెస్ట్ రోణ పక్కకు పోయింది. నిజానికి ఇది ప్రజల్లో అవగాహన లేమి కారణంగా జరుగుతున్నదని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. జీవవైవిధ్యం కాపాడటంలో పులులదే కీలక పాత్ర. వాటికి తెలియకుండానే అడవిని రక్షిస్తుంటాయి. మొక్కలను తినే జీవ జాతులను పులులు చంపి తినకపోతే అడవి అనేదే మిగలదు. అంటే...సాధు జంతువులను వేటాడుతూ...పులులు ఎకో సిస్టమ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఉంటాయి. అయితే రానురాను అడువులు ధ్వంసం అవుతుండటం వల్ల వీటి సంఖ్య తగ్గిపోతోంది. అవి మనుగడ సాగించేందుకు అవసరమైన అనుకూల వాతావరణం ఉండటం లేదు. క్రమంగా ఇవి అంతరించి పోయే ప్రమాదముందని గుర్తించిన ప్రపంచ దేశాలు, ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుకుంటున్నారు. ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టు-పక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతో కూడిన దట్టమైన అడవి ఉండాలి. అందుకే ఈ లెక్కన ఇప్పుడున్న పరిస్థితుల్లో పులులు. మనుగడ సాగించాలంటే...ఒక్కో పులికి 25 వేల ఎకరాల అడవిని కాపాడుకోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. పులి తన ప్రాణాలు కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంది. మూడేళ్ల వయసు రాగానే మగ పులి సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు-చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. అయితే అడవులు అంతరించడం. అడవుల్లో నీటి కుంటలు లేకపోవడం వల్ల అవి ఊళ్లలోకి రావాల్సి వస్తోంది. నగరాలు పెరగడం, గ్లోబలైజేషన్ ప్రభావంతో రానురానూ అడవులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం 93 శాతం పులులు కేవలం అడవుల నరికివేత వల్ల అంతరించిపోతున్నాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం కేవలం ఆరు జాతుల పులులు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. అనేక టైగర్ జాతులు పూర్తిగా అంతరించి పోయాయి. 2014 వరల్డ్ వైడ్ ఫండ్ లెక్కల ప్రకారం వందేళ్ల క్రితం సుమారు లక్ష పులులు ఉండేవి. కాని ఇప్పుడు వాటి సంఖ్య చాలా తగ్గిపోయిందని వరల్డ్ వైడ్ ఫండ్ ప్రతినిధులు చెబుతున్నారు. పులుల సంఖ్య పెరగడం ద్వారా ఎకో సిస్టమ్ లో మంచి మార్పులు రావడమే కాకుండా, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. పులులు అంతరిపోవడానికి వేట, వాతావరణ మార్పులతోపాటు, పులులకు షెల్టర్ లేకపోవడం ముఖ్యమైన కారణాలు. అంతేకాకుండా పులి చర్మం, గోళ్లకు డిమాండ్ ఎక్కువ. చైనీస్ సంప్రదాయ వైద్యంలో పులుల గోళు, పళ్లు,మీసాలను ఉపయోగిస్తారు. వాటి కోసం ఎక్కువ ధర చెల్లిస్తారు. అందుకే పులుల వేట, స్మగ్లింగ్ కూడా ఎక్కువైంది. దీంతో కేవలం పులులు మాత్రమే కాదు. ఇతర జీవులు కూడా మెల్లగా అంతరిస్తున్నాయి. కేవలం అడవుల్ని నరకడం వల్లనే దాదాపు 93 శాతం వాటి ఆవాసాల్ని కోల్పోతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. పులుల్ని, ఇతర జీవరాశులని సంరక్షించుకోవాలంటే.. అడవులు పెంచడం ఒక్కటే మార్గమని అర్థం అవుతోంది. అడవులు పెంచడం ద్వారా జంతువుల సంఖ్య పెరగడమే కాక పర్యావరణ సమతుల్యం కూడా దెబ్బ తినకుండా ఉంటుంది. వాతావరణ మార్పులు కూడా జంతువులు అంతరించ డానికి కారణం కాబట్టి వాతావరణ మార్పులకు కారణమయ్యే ప్లాస్టిక్, కాలుష్యాన్ని కూడా తగ్గించాల్సిన అవసరం ఏర్పడింది. మనదేశంలో పులి జాతీయ జంతువు కాబట్టి కొంతవరకైనా పులుల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా మేలుకోకపోతే ఉన్న నాలుగు జాతులు కూడా అంతరించిపోయే ప్రమాదం ఉందని గత కొన్నేళ్ల నుంచి -టైగర్ ట్రాకర్స్ వ్యవస్థను బలపరిచారు. ప్రపంచం మొత్తం మీద ఉన్న పులుల సంఖ్యలో సగానికి పైగా మనదేశంలోనే ఉన్నాయి. పులులను కాపాడుకోవల్సిన అవసరాన్ని మనదేశం ఎప్పుడో గుర్తించింది. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించి, తర్వాతి ఏడాది నుంచే ప్రాజెక్ట్ -టైగర్ ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలు తెచ్చినా వాటి అంతం ఆగడం లేదు. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు- చేశారు. పులుల సంరక్షణ గురించి ప్రజల్ని చైతన్యవంతం చేయడం కోసం ఇండియన్ రైల్వే.. టైగర్ ఎక్స్‌ప్రెస్ పేరుతో టూరిస్ట్ రైలు సేవలను కూడా ప్రారంభించింది. ఇందులో బాంధవగడ నేషనల్ పార్క్, కన్హా నేషనల్ పార్కులో సఫారీకి తీసుకెళ్తారు.ప్రపంచ పులుల్లో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉండడం విశేషం.

## ప్రతి ఇంటిపై సోలార్ వెలుగులు నింపాలి: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 29-ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా నంద్యాల జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పీఎం సూర్య ఘర్ పథకంపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఏపిఎం లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... నంద్యాల జిల్లాలో ప్రతి ఒక్కరూ పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ పథకం ద్వారా ఆదాయం పెరగడంతో పాటు పొల్యూషన్ నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఒకసారి ఇంటి పై కప్పులపై సోలార్ ప్యానల్ పెట్టుకుంటే 25 ఏళ్ల వరకు విద్యుత్ సమస్య ఉండదన్నారు. ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయితే ప్రభుత్వానికి అమ్మవచ్చు కరెంటు పోతుందనే టెన్షన్ ఉండదు ఈ వి, ఎలక్ట్రానిక్ వాహనాలు చార్జింగ్ లాంటివి కూడా ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. కావున ప్రతి గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, గ్రామాలకు వెళ్లి ప్రజాప్రతినిధులను ఎంపీటీసీ, జడ్పిటిసి తదితరులను ఇన్వాల్వ్ చేసి ప్రతి ఇంటి రూఫ్ టాప్ పైన సోలార్ సిస్టం ఇన్స్టాల్ చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు బ్యాంకర్ల సహకారం ఎంతో అవసరమన్నారు.నంద్యాల జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఒక్కొక్క నియోజకవర్గానికి 10 వేలు టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి 70 వేల టార్గెట్ చేయాల్సి ఉందన్నారు. ఈ పథకం ద్వారా ఒక కిలో వాట్ కు 30 వేల సబ్సిడీ, 2, కిలో వాట్స్ కి 60 వేలు, 3,కిలో వాట్స్ కి 78, వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. ఎస్సీ ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. మంచి పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని రాబోయే రోజులలో నంద్యాల జిల్లాను సోలార్ వెలుగులతో నింపి జిల్లాగా తీర్చిది ద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

## అప్పుడప్పుడు ఆరోగ్యాన్ని చెకప్ చేయించాలి :మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్





--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 29-పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యాన్ని చెకప్ చేయించు కోవాలని మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల స్థానిక సలీం నగర్ నందు ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ నందు పబ్లిక్ హెల్త్ వర్కర్లకు మరియు నాన్ పీహెచ్ వర్కర్ల కి మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యాన్ని చెకప్ చేపించుకుంటూ ఉండాలని అలా చేపించుకున్నప్పుడు మనం ఆరోగ్యంగా ఉన్నామా అనారోగ్యంగా ఉన్నామా అనేది తెలుస్తుందన్నారు . అలాగే మన హెల్త్ కు సంబంధించిన మెడిసిన్స్ ని తప్పకుండా వాడాలన్నారు . ప్రజల ఆరోగ్యంతో పాటు మన ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మన పైనే ఉందని ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ తెలిపారుఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న , మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా. శానిటేషన్ సూపరైజర్ మురళీధర్ , అధికారులు , పారిశుద్ధ కార్మికులు , డాక్టర్లు , తదితరులు పాల్గొన్నారు.

## పరస్పర వాదనలతో ముగిసిన సమావేశం






---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 29-నంద్యాల మున్సిపల్ సమావేశం అధికార, ప్రతిపక్ష వార్డు కౌన్సిలర్ల వాగ్వివా దాలతో ముగిసింది. మంగళవారం చైర్ప ర్సన్ మాబున్నీసా అధ్యక్షతన తో కమిషనర్ బండి శేషన్న మున్సిపల్ సమావేశం నిర్వహిం చారు. ప్రభుత్వం పట్టణాభివృద్ధికి విడుదల చేసిన నిధులను వైసీపీ కౌన్సిలర్లు ప్రాతి నిధ్యం వహిస్తున్న వార్డులకే కేటాయించి వివక్ష చూపుతున్నారని టిడిపి కౌన్సిలర్లు ఆరోపించడంతో వివాదం చోటు చేసుకుంది. టిడిపి వార్డు లో వర్కులు జరగడం లేదని 21 వార్డు టిడిపి కౌన్సిలర్ చెరుకు శ్రీదేవి. 27 వార్డు టిడిపి జైనాభి సభలో కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు . మా వార్డుపై పక్ష పాతం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెదేపా కౌన్సిలర్లు మహబూబ్ వలి. ఖండే శ్యాంసుంధర్ లాల్ నిల్చొని వారికి మద్దతు తెలిపారు . నేను అన్ని వార్డులను సమానంగా చూస్తునానని ఏ వార్డు పై నేను పక్ష పాతం చూపలేదని ఛైర్ పర్సన్ మాబున్నిసా పేర్కొన్నారు . అజెండాలో మొత్తం 22 అంశాలు పొందుపరచారు. 21 అంశాలకు కౌన్సిలర్లు ఆమోదిస్తూ తీర్మానాలు చేశారు. ఒక అంశంపై టౌన్ ప్లానింగ్ అధికారి కి కౌన్సిలర్ల కు మాటల యుద్ధం వల్ల వాయిదా వేశారు. పట్టణంలో కుక్కలను అరికట్టాలని పలువురు కౌన్సిలర్లు ఛైర్ పర్సన్ మాబున్నిసా ను కోరారు. ఈ విషయం పై కమిషనర్ మాట్లాడుతూ గతంలో కుక్కల కూని ఆపరేషన్లకు కేటాయించిన సంస్థలను రద్దు చేయడం జరిగిందన్నారు. స్నేహ అనిమల్స్ సొసైటి వారు ముందుకు వచ్చారని ఆపరేషన్ దీయోటర్లో వారికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించడమైనదని వచ్చే నెలలో తప్పకుండా కుక్కల కు కూని ఆపరేషన్లు జరుగుతాయని తెలిపారు. సచివాలయ అడ్మిన్లు కలెక్టరేట్ లో పని చేస్తున్నారని వార్డులో ఉన్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు ఛైర్ పర్సన్ మాబున్నిసా కు విన్న వించారు. కమిషనర్ మాట్లాడుతూ తొందరలో సిబ్బంది తో సచివాలయాల్లో ఇబ్బందులు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఆదికారులు టిడ్కో గ్రుహలు లబ్ధిదారులకు కేటాయింపు జరగలేదని కానీ బ్యాంక్ వారు కంతులు కట్టాలని వత్తిడి చేస్తున్నారని కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం పై కమిషనర్ మాట్లాడుతూ నా దృష్టికి వచ్చిందని దీని పూర్తి గా విచారించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బండి శేషన్న తో పాటు ఎమ్ ఈ గురప్పయాదవ్. డీఈలు. టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. రెజ్వాన. ఆర్ ఓ వెంకట రెడ్డి. శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. ఏఇ లు. తదితరులు ఉన్నారు.

## తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 29-నంద్యాల జిల్లా దామగట్లకు చెందిన ఆవుల.మహేష్ వయస్సు సుమారు 09 సంవత్సరాలు తండ్రి శ్రీనివాసులు ఈ బాలుడు సోమవారం స్కూలుకని బయల్దేరి స్కూల్ కి వెళ్లకుండా తల్లికి చెప్పకుండా బ్రాహ్మణకోట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దామగట్ల నుండి నందికొట్కూర్ కు వచ్చి అక్కడినుండి గడివేముల మండలం గ్రంధివేములకు వెళ్లడానికి బస్సు ఎక్కి పొరపాటున గడివేములలో దిగినాడు. బస్టాండు లో ఉన్న వారు తప్పిపోయినాడని గ్రహించి బస్టాండ్ లో ఏడుస్తూ ఉండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బాలుడిని గడివేముల పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి విచారించగా ఊరు పేరు తల్లిదండ్రుల పేరు చెప్పగా ఎస్సై దామగట్ల కు చెందిన గ్రామ సచివాలయ సిబ్బంది కి సమాచారం అందించి వారి తల్లిదండ్రుల వివరాలు సేకరించి సోమవారం రాత్రి సుమారు 11:00 గంటలకు బాలుడిని వారికి అప్పగించారు .స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే స్పందించి బాలుడిని వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చిన గడివేముల సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి ని జిల్లా ఎస్పీ గారు అభినందించారు

## గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై సమీక్షా సమావేశం

### అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ యుగంధర్ బాబు



- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 29-నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం గంజాయి, డ్రగ్స్ నియంత్రణ పై జిల్లా నోడల్ ఆఫీసర్ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ . యుగంధర్ బాబు సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ హాజరై మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియంత్రణలో భాగంగా జిల్లాలోని గ్రామీణ పట్టణ శివారు ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి గుర్తించిన మారుమూల, అటవీ మరియు దట్టమైన పొదలను తొలగించాలి.రైల్వే స్టేషన్ నందు గల పార్సెల్ ఆఫీసుకు గంజాయి డ్రగ్స్ మొదలగునవి అక్రమంగా రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు . ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మరియు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గారితో పాటు జిల్లా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్ హనుమన్న , జిల్లా ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ రవికుమార్ , ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ ,నంద్యాల మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్ , రైల్వే పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కుమారి , నంద్యాల డీ ఐఈఓ శంకర్ నాయక్ మరియు వివిధ శాఖలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం

శ్రీశైలం జులై 29 )లోకకల్యాణం కోసం దేవస్థానం మంగళవారం ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి.

# ఆదాయం తగ్గిందా..లెక్కలు ఏం చెబుతున్నాయ్

విజయవాడ, జూలై 29, పాలనలో ఒక్కొక్కరిది ఒక్కో విధానం. కొందరు అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించడం ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరిగి ప్రభుత్వ ఆదాయం పెంచుకోవాలని చూస్తారు. మరికొందరు నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా నగదును అందించి.. వారిలో ఆర్థిక అభివృద్ధి పెంచాలని చూస్తారు. తద్వారా వారికి కొనుగోలు శక్తి పెరిగి పనుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని భావిస్తారు. అయితే ఇందులో మొదటి అంశాన్ని ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎంచుకున్నారు. రెండో మార్గాన్ని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేశారు. అయితే చంద్రబాబు ఆలోచనలు దూర దృష్టితో ఉంటాయి. భవిష్యత్తు తరాల ప్రయోజనాలు, వారికి ఉత్తమ ఉపాధితో పాటు ఉద్యోగాలు అందించేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. అందులో భాగమే ఐటీ రంగం. అయితే ఇక జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను విపరీతంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో డబ్బు చలామని పెంచారు. తద్వారా ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచారు. అయితే ఇంత చేసిన ఏపీలో ఆర్థికాభివృద్ధి పెరగకపోవడం, ప్రభుత్వ ఆదాయం జరగకపోవడం ఆందోళన కలిగించే విషయం ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోయి కూడా ఏడాది అవుతోంది. అయితే 2025 ? 26 ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసికంలో ఏపీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దిగజారిందని జగన్ ఆరోపించారు. గణాంకాలతో సహా పేర్కొన్నారు. ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేశారు. రాష్ట్ర ఆర్థిక స్థిరత్వం ప్రమాదంలో ఉందని జగన్ అభిప్రాయపడ్డారు. అయితే జగన్ కంట్రోల్ అండ్ ఆడిటర్ జనరల్ కాగ్ నివేదికలతో సహా వెల్లడించడం విశేషం. ఇదేనా సంపద పెంచడం అంటూ జగన్మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. దీంతో ఇది వైరల్ అంశంగా మారింది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం లో.. రాష్ట్ర సొంత ఆదాయం కేవలం 3.47% మాత్రమే. కేంద్రం నుంచి వచ్చిన నిధులు అన్నీ కలిపి చూస్తే ప్రభుత్వ ఆదాయంలో మొత్తం 6.14% వృద్ధి మాత్రమే ఉంది. అదే సమయంలో రాష్ట్ర హక్కులు ఏకంగా 15.61 శాతం పెరగడం దారుణం. దీనిని ఉదహరిస్తూ చెప్పారు జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రంలో సంపద సృష్టి, ఆదాయం పెంపొందించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.అయితే కూటమి పెద్దలు బాగానే కష్టపడుతున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చేలా ఉన్నాయి. మరోవైపు పింఛన్ల లబ్ధిదారుల కు వెయ్యి రూపాయల పెంచి అందిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణం జరుగుతుంది. పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. అయినా సరే ప్రభుత్వానికి నేరుగా ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడం ఏమిటి అనేది చర్చ. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు అప్పుల మీద ఆధారపడడం ఏమిటనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మిగులుతోంది. ఇంత పెద్ద పరిశ్రమలు వస్తున్నాయి. పెట్టుబడులు వస్తున్నాయి. కానీ పనుల రూపంలో ఆదాయం పెరగడం ఏమిటి అనేది ఒక రకమైన ప్రశ్న.అయితే చంద్రబాబుఆలోచనలన్నీ భవిష్యత్తు తరాలను ఆలోచించుకొని ఉంటాయి. అయితే ఆ ఆలోచనల ఫలితాలు రావడానికి చాలా సమయం పడుతుంది. 1995లో అధికారం చేపట్టారు చంద్రబాబు. అప్పటినుంచి 2004 వరకు ఐటీ పరిశ్రమలపై ఎక్కువగా దృష్టి పెట్టారు. రసాయన రంగానికి ప్రోత్సాహం అందించారు. కానీ వాటి ఫలితాలు 2004 తర్వాత వచ్చాయి. అప్పటికే చంద్రబాబు అధికారానికి దూరమయ్యారు. రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చారు చంద్రబాబు. ఆ సమయంలో అనంతపురం జిల్లాకు కియో పరిశ్రమలను తెప్పించారు. కానీ ఆ పరిశ్రమ ఉత్పత్తులను ప్రారంభించింది 2019 తర్వాత. ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా అప్పటినుంచి ప్రారంభం అయింది. అంటే ముందు ప్రభుత్వాలు చేసిన ఫలితాలు తర్వాత ప్రభుత్వాలు అనుభవిస్తాయన్నమాట. అయితే ఈ విషయంలో చంద్రబాబు ముందు చూపు.. తరువాత ప్రభుత్వాలకు ఎంతో మేలు చేశాయి.ప్రస్తుతం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తుండడం వాస్తవం. ప్రపంచ దిగ్గజ సంస్థలు సైతం వస్తుండడం నిజం. అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయడం కూడా అంతే వాస్తవం. అమరావతి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం కావడం కూడా నిజం. అయితే ఇవి సన్నాహాల్లో మాత్రమే ఉన్నాయి. ఇంకా పూర్తిస్థాయిలో పనులు ప్రారంభం కాలేదు. ప్రారంభమైన మరుక్షణం నుంచి పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది. నిర్మాణ రంగంలో ఉత్పత్తులపై వచ్చే పన్నులు పెరుగుతాయి. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్నారు సీఎం చంద్రబాబు. అక్కడ స్థిరపడిన చాలామంది ప్రవాస ఆంధ్రులు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. అయితే అలా ఒప్పుకున్న వెంటనే ఏపీ ప్రభుత్వానికి ఆదాయం పెరగదు. పెట్టుబడులు పెట్టి ఉత్పత్తులు ప్రారంభించిన తర్వాతే ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. అయితే ఇప్పుడు ఏపీ ఆర్థిక పరిస్థితి మరింతగా ముందుకు కదలక పోవడానికి ఆదాయం సమకూరకపోవడమే కారణం. కానీ జగన్మోహన్ రెడ్డి సైతం అభివృద్ధి పనులు చేపట్టలేదు. పరిశ్రమలను తెప్పించలేదు. కానీ ముందు ప్రభుత్వం చేసిన పనులు ఫలితాలు.. తరువాత ప్రభుత్వంగా జగన్ దక్కించుకున్నారు. ఇప్పుడు కూడా అదే జరిగింది. జగన్ సర్కార్ చర్యలు పుణ్యమా అని ప్రస్తుత ప్రభుత్వానికి ఆదాయం తగ్గినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కోట్ల దుర్వినియోగం..

ఒంగోలు, జూలై 29, ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమంపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ నివేదిక ఆగస్టు మొదటి వారం నాటికి రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కార్యక్రమంలో ఆర్థిక అవకతవకలు జరిగినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అట్టడుగు స్థాయి క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో అవినీతి, నాణ్యత లేని సరఫరాలు, ప్రజా నిధుల దుర్వినియోగం ఆరోపణలు వచ్చాయి.ఈ కార్యక్రమం డిసెంబర్ 15, 2023, ఫిబ్రవరి 3, 2024 మధ్య నిర్వహించారు. వార్డు నుండి రాష్ట్ర స్థాయి వరకు యువతను క్రీడా పోటీల ద్వారా నిమగ్నం చేయడానికి రూపొందించారు. ఇది అందరి దృష్టిని ఆకర్శించింది. ఆటగాళ్ళు, అసోసియేషన్ సభ్యుల నుండి ఫిర్యాదులు వెలువడటం ప్రారంభించడంతో వివాదం మె?దలైంది. నాణ్యత లేని కొనుగోళ్లు, స్పోర్ట్స్ కిట్‌లను సక్రమంగా పంపిణీ చేయకపోవడం వంటి ఆరోపణలు ఉన్నాయి.ఈ పథకం కింద అందించిన క్రికెట్ బ్యాట్‌లు, షటిల్ రాకెట్లు, బంతులు, టీ షర్టులు చాలా తక్కువ నాణ్యతతో ఉన్నాయని, అవి ఒకే ఒక్క ఆట తర్వాత నిరుపయోగంగా మారాయని పలువురు ఆటగాళ్ళు విజిలెన్స్ అధికారులకు చెప్పినట్లు సమాచారం.వైసీపీ పాలనలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని అనేక మంది ఆటగాళ్లు పేర్కొన్నారు. ఆ ఫిర్యాదులో మాజీ క్రీడా మంత్రి ఆర్కే రోజా, మాజీ శాంంఖ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిలపై ప్రత్యేకంగా ఆరోపణలు వచ్చాయి. దీంతో క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కొనసాగుతున్న విజిలెన్స్ విచారణతో పాటు స్వతంత్ర శాఖాపరమైన దర్యాప్తునకు ఆదేశించారుజిల్లా స్థాయిలో పూర్తయిన విజిలెన్స్ విచారణ ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో జరుగుతోందని శాంంఖ చైర్మన్ ఎ.రవి నాయుడు ధృవీకరించారు. ఆగస్టు 10 నాటికి తుది నివేదిక అందిస్తారని, రూ.60?65 కోట్ల దుర్వినియోగం బయటకు వచ్చే అవకాశం ఉందన్నారు.మిగిలిపోయిన స్పోర్ట్స్ కిట్‌లు ఏమయ్యాయో కూడా దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ కిట్‌లను కార్యక్రమం తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ చాలా మందికి అవి అందలేదని తెలుస్తోంది. విజేతల ఎంపిక సమయంలో రాజకీయ జోక్యం జరిగిందని, చివరి రౌండ్లలో వైసీపీ అనుబంధంగా ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆగస్టులో విజిలెన్స్ నివేదికలో ఏముంటుందో చూడాలి.

# 21 మందికి స్ట్రెయిట్ వార్నింగ్

విజయవాడ, జూలై 29, మీరు బాగా పనిచేస్తే..పార్టీకి మేలు. మీ పొలిటికల్ ఫ్యూచర్ బాగుంటుంది. మళ్లీ మళ్లీ గెలిచి అసెంబ్లీకి రావొచ్చు. ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతామంటే మీ ఇష్టం. అంటూ ఎమ్మెల్యేలకు పదే పదే వార్నింగ్ ఇస్తూ వస్తున్నారు సీఎం చంద్రబాబు. ఇప్పటికే పలుసార్లు ఎమ్మెల్యేలతో భేటీ అయి..అలర్ట్ చేస్తూ..వార్నింగ్‌లు ఇస్తూ వచ్చిన చంద్రబాబు..ఇప్పుడు ఏకంగా వన్ టు వన్ మీటింగ్‌లు పెట్టుకున్నారు.ఇప్పటివరకు 21మంది ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అయిన సీఎం..ఎమ్మెల్యేల పనితీరు..వారి మీద వచ్చిన ఆరోపణలు..క్యాడర్‌కు అందుబాటులో ఉన్న తీరు..ప్రభుత్వ పథకాలపై ప్రచారం వంటి వాటిపై ఆరా తీశారట. తనకు ఉన్న ఇన్ఫర్మేషన్, గ్రౌండ్ రిపోర్ట్ ప్రకారం ఎమ్మెల్యేలకు ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇస్తున్నారట. ఎమ్మెల్యేల అనుకూలతలు, ప్రతికూలతలను బేరీజు వేస్తూ..పనితీరులో ఎలాంటి మార్పులు చేసుకోవాలో సలహాలు, సూచనలు ఇస్తున్నారట.నియోజకవర్గాల వారీగా ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలపై సర్వే రిపోర్ట్ తెప్పించుకున్నారట. ఇప్పటివరకు 21 నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమావేశాలు పూర్తయ్యాయి. రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నారు. ఒక్కో ఎమ్మెల్యేలతో దాదాపు 45 నిమిషాల పాటు సమావేశమవుతున్నారు. ఎమ్మెల్యేలు పనితీరు ఇంకా మెరుగుపరచుకోవాలని సూచిస్తున్నారు. ముందుగా కాస్త వెనుకబడ్డారనుకున్న ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడుతున్నారని అంటున్నారు.బాగా పని చేస్తున్న వారిని అభినందిస్తుండటంతో పాటు..లోపాలున్న చోట మొహమాటం లేకుండా సరిదిద్దుకోవాలని చెబుతున్నారు చంద్రబాబు. కొన్ని నియోజకవర్గాల్లో అవినీతి ఆరోపణలు, పార్టీ కార్యకర్తలతో సఖ్యత లేని చోట అంతా సరి చేసుకోవాలని సూచిస్తున్నారు. కాంట్రవర్సీకి కేరాఫ్‌గా ఉంటున్న కొందరు ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తేల్చి చెబుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను మీడియాకు కూడా వివరిస్తున్నారు.పలువురు ఎమ్మెల్యేలకు 60 నుంచి 65 శాతం మేరకే ప్రజా సంతృప్తి ఉన్నట్లుగా రిపోర్ట్ అందడంతో వారికి స్పెషల్‌గా క్లాస్ తీసుకుంటున్నారట. ముఖ్యంగా కొత్త ఎమ్మెల్యేలకు, ఫస్ట్ టైమ్ గెలిచిన వారికి పదే పదే హితబోధ చేస్తున్నారు చంద్రబాబు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దని చెబుతూ వస్తున్నారు. ప్రజలు, కార్యకర్తలతో మమేకం కావాలని పదేపదే చెబుతున్న చంద్రబాబు ఇప్పుడు మరోసారి క్లాస్ తీసుకుంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. తప్పవని సీరియస్ వార్నింగ్స్ ఇస్తున్నారట.ఇదే సమయంలో శాసనసభ్యులపై వస్తున్న ఆరోపణలకు సంబంధించిన వివరాలను కూడా వారి ముందు పెట్టి వివరణ తీసుకుంటున్నారట. అనవసర విషయాల జోలికి వెళ్లొద్దని, అడ్డగోలుగా బిహేవ్ చేస్తే ఎవరి విషయంలోనైనా వెనుకాడేది లేదని తేల్చి చెబుతున్నారు. గాడి తప్పినా..పార్టీ లైను క్రాస్ చేసినా యాక్షన్ తప్పదని ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది.త్వరలో మరికొందరి ఎమ్మెల్యేలతో వన్ టు వన్ భేటీ కానున్నారు. సింగపూర్ పర్యటన తర్వాత మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. అయితే ప్రభుత్వం ఎన్ని పథకాలు ఇస్తున్నా..సర్కార్ నడుపుతున్న పెద్దలుగా ఎంత బాగా పనిచేస్తున్నా..ఎమ్మెల్యేల పనితీరు చాలా కీలకమని భావిస్తున్నారట చంద్రబాబు. లోకల్‌గా ఎమ్మెల్యేకు మంచి పేరు లేకపోయినా..ఆయన పబ్లిక్‌లో ఉండకపోయినా..క్యాడర్ సమస్యలు పరిష్కరించకపోయినా.. తేడా కొట్టొచ్చని అంచనా వేస్తున్నారట. అందుకే ముందుగానే అలర్ట్ అయి ఎమ్మెల్యేలను సెట్‌రైట్ చేసే పనిలో పడ్డారట చంద్రబాబుఇప్పుడు కూడా ఎంత అలర్ట్ చేయాలో అంత అలర్ట్ చేస్తున్నామ్. ఏం సహకారం కావాలో చెప్పండి చేస్తామంటున్నామ్. అయినా కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా తిరుగుతామంటే ఇక మీ ఇష్టం. మంచి మార్కులు రాకపోతే టికెట్ కట్ చేయడానికి కూడా వెనకాడబోనని..ఇదే ఫైనల్ వార్నింగ్ చెప్తున్నారట. ఇప్పటికీ మించిపోయిందేమి లేదంటున్న బాబు..పద్దతి మార్చుకుని బాగా పనిచేయండి..మంచి ఫ్యూచర్ ఉంటదని భరోసా ఇస్తున్నారట. బాబు హితబోధతో అయినా ఎమ్మెల్యేల తీరులో మార్పు వస్తుందా లేదా అనేది చూడాలి.

## 1,000 కోట్లతో 2,000 కి.మీ. కొత్త రోడ్లు

విశాఖపట్టణం, జూలై 29, ఏపీలో రోడ్లకు మహర్దశ రానుంది.రూ.1,000 కోట్లతో 2,000 కి.మీ. కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా మరో రూ.500 కోట్లతో రహదారులకు మరమ్మత్తులు చేయాలని నిర్ణయించారు.రాష్ట్రంలోని 2,000 కిలోమీటర్ల మేర రాష్ట్ర, జిల్లా రహదారులను రూ.1,000 కోట్లతో కొత్తగా నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి అంచనాలు, టెండర్ల ప్రక్రియను వెంటనే మొదలుపెట్టాలని సూచించారు. మరో రూ.500 కోట్లతో రాష్ట్రంలో దెబ్బతిన్న మిగిలిన రహదారుల మరమ్మతులు వర్షాకాలంలోనూ కొనసాగించాలని... వీలున్నంత త్వరగా వీటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... రాష్ట్రంలోని రహదారుల పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రహదారుల నిర్మాణం, మరమ్మతులపై తీవ్ర నిర్లక్ష్యం చూపడంతో అధ్వాన్నంగా తయారయ్యాయని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో ఇంకా ఎన్ని రోడ్లు మరమ్మతులు చేయాలి..? ఏవి కొత్తగా నిర్మించాలి..? నిర్వహణకు ఏ రహదారులు ఇవ్వాలి... అనేదానిపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నిర్దేశించారు. మరోవైపు ఇప్పటికే రాష్ట్రంలో 20,000 కి.మీ. మేర రహదారులను గుంతలు లేకుండా మరమ్మతులు పూర్తి చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారుజాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర రహదారులు ఉండాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు "ప్రతీ రహదారి నిర్దేశిత ప్రమాణాలతో నిర్మించాలి. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ నుంచి కొత్త రహదారుల నిర్మాణం చేపట్టాలి. ఏ రోడ్డు ఏ కాంట్రాక్టర్ నిర్మించారు, ఎవరు మెయింటైన్ చేస్తున్నారు.. అనే వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి. ప్రతీ 50 కి.మీ. చొప్పున అన్ని రహదారులపై సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలోని అన్ని రహదారుల్లో మరమ్మత్తుల నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించి.. వర్షాకాలంలో రోడ్లు పాడవ్వకుండా కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.12,653 కి.మీ పొడవున రాష్ట్ర హైవేలు ఉండగా... ఇందులో 20 కి.మీ. కన్నా పొడవైన రోడ్లను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. 20 కి.మీ. కన్నా పొడవైన రాష్ట్ర హైవేలు మొత్తం 260 వరకు ఉన్నాయి. అంటే 10,200 కి.మీ పొడవైన రాష్ట్ర హైవేలను పీపీపీ విధానంలో చేపట్టేందుకు వీలుంది.

# కేబినెట్ షఫ్లింగ్ పై ఆశలు

## రెడ్డమ్మకు అవకాశం...

కడప, జూలై 29, కూటమి ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ. ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట. క్యాబినెట్ షఫ్లింగ్ ఎప్పుడో..ఎంతమందిని తప్పించి..మరెంతమంది కొత్తవారిని తీసుకుంటారో తెలియదు కానీ..మంత్రివర్గ విస్తరణ జరిగితే తమకు బెర్త్ పక్కా అంటూ ఊహల్లో తెలియాడుతున్నారు ఆశావహులు. ఉమ్మడి కడప జిల్లా నుంచి ఇద్దరి పేర్లు క్యాబినెట్ రేసులో సౌండ్ రీసౌండ్ చేస్తున్నాయ్. మొదటి ప్రయత్నంలోనే గెలిచి ఫైర్ బ్రాండ్ లీడర్‌గా పేరు తెచ్చుకున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఒకరు అయితే..మరొకరేమో పార్టీకి వీర విధేయుడు పుట్టా సుధాకర్‌యాదవ్.చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప అంటే విడిపోయిన నాలుగు జిల్లాలు ఉమ్మడి రెండు జిల్లాలకు కలిపి కొత్తగా ఎమ్మెల్యే అయిన రాయచోటి శాసనసభ్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మొదటి విడతలో మంత్రివర్గంలోకి తీసుకున్నారు. నాలుగు జిల్లాలకు కలిపి ఒకరే మంత్రిగా ఉండటాన్ని కొంతమంది పెద్దలు పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లడంతో విస్తరణలో మరొకరికి అవకాశం ఇస్తామన్నారని టాక్. దీంతో ఉమ్మడి కడప జిల్లాలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేరు మంత్రివర్గ విస్తరణలో ప్రముఖంగా వినిపిస్తోంది.గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన పుట్టా..మైదుకూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయ్. శ్రీవారి సేవతో పాటు సమాజసేవ చేసి చంద్రబాబుకు నమ్మినబంటుల ఉంటున్నారు. పైగా ఉమ్మడి కడప జిల్లాలో ఒకే ఒక బీసీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్. ఆర్థికంగా, సామాజికంగా సేవా దృక్పథం కలిగిన వ్యక్తి కావడం పుట్టా సుధాకర్ యాదవ్‌కు కలిసి వచ్చే అంశాలు.ఇక మొదటి ప్రయత్నంలోనే కడప ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచి హిస్టరీ క్రియేట్ చేశారు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి. మైనార్టీల కంచుకోటైన కడపలో గెలిచి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విప్ పదవిని కూడా దక్కించుకున్నారు. కడప నగరంలో ఓవైపు అభివృద్ధిపై ఫోకస్ పెట్టడంతో పాటు..ప్రత్యర్థి వైసీపీతో ఢీ అంటే ఢీ అంటుండటం మాధవిరెడ్డికి కలిసొచ్చే అంశాలు. ఆమె ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే కావడం..జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, మిగతా నేతల్లో సీనియర్లు ఎక్కువ. ఇది మాధవి రెడ్డికి కాస్త ఇబ్బందిగా మారొచ్చు. అయినా మంత్రి పదవి రేసులో కడప శివంగిగా పిలవబడే మాధవి రెడ్డి పేరు కూడా బలంగా వినిపిస్తోంది.మాధవిరెడ్డి భర్త కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికంగా బలవంతుడు కావడంతో పాటు నేరుగా చంద్రబాబు లోకేశ్‌తో టచ్‌లో ఉంటూ పొలిట్ బ్యూరో వ్యవహారాలు చక్కబెడుతుంటారు. మంత్రి పదవి వస్తే జిల్లాపై పట్టు పెంచుకోవడానికి అవకాశం ఉంటుందనే భావనతో భార్యకు మంత్రి పదవి తెచ్చుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారట. కడప మహానాడు వేదికగా శ్రీనివాస్ రెడ్డి భావోద్వేగం భార్యకు మంత్రి పదవి కోసమే అంటూ లోకల్ పార్టీలో టాక్.ప్రభుత్వ ఏర్పాటు అప్పుడే మాధవిరెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కుతుందని అనుకున్నారు. అప్పుడు కుదరలేదు. మహానాడు వేదికగా ఏకంగా సీఎం చంద్రబాబు మాధవిరెడ్డిని పొగడటంతో ఆమెకు బెర్త్ పక్కా అన్న ఊహాగానాలు ఎక్కువయ్యాయి. అయితే మంత్రిగా అవకాశం ఇవ్వాలనుకుంటే బీసీ కోటా లేకపోతే మహిళా కోటా.. ఇలా చూస్తే వీరిద్దరిలో ఒకరికి అవకాశం తప్పనిసరి. ఈ ఈక్వేషన్స్ నేపథ్యంలో మాధవిరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్‌లలో ఎవరికి అమాత్య యోగం వరించబోతుందో చూడాలి మరి.

# 11 రోజుల పాటు దసరా

విజయవాడ, జూలై 29, విజయవాడ కనకదుర్గ దేవస్థానంలో దసరా ఉత్సవాలు-2025కు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది దేవస్థానం. పోస్టర్ తోపాటు నవరాత్రుల ఏయే రోజు ఏ కార్యక్రమాలు చేపడతారు అనే వివరాలను వెల్లడించింది. అయితే ఈసారి 11 రోజులపాటు దసరా ఉత్సవాలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. అమ్మవారిని ఆయా రోజుల్లో లక్షలాది మంది భక్తులు దర్శించుకుంటారు. అందుకు తగ్గట్టుగా ఆలయ సిబ్బంది రెండునెలలు ముందుగానే ఏర్పాట్లు నిమగ్నం అవుతుంది. తాజాగా బెజవాడ కనకదుర్గ ఆలయంలో ఈ ఏడాది సెప్టెంబర్ 22 దసరా మహోత్సవాలు మొదలుకానున్నాయి. అక్టోబర్ రెండు వరకు కంటిన్యూ జరుగుతున్నాయి. ఈ ఏడాది 11 రోజుల పాటు ఈ మహోత్సవాలు జరగనున్నాయి. అయితే అమ్మవారికి పట్టువస్త్రాలను సెప్టెంబర్ 29న సీఎం చంద్రబాబు సమర్పించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ప్రధాన పూజారి వెల్లడించారు. సామాన్యులకు పెద్ద పీట వేస్తూ దుర్గమ్మ దర్శనం అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఆలయ ఈవో శీనా నాయక్. అక్టోబర్ 2న అనగా గురువారం విజయదశమి రోజు ఉదయం మహా పూర్ణాహుతి, సాయంత్రం పవిత్ర కృష్ణ నదిలో తెప్పోత్సవం కార్యక్రమం జరగనుంది. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, దేవాదాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటామన్నారు. 11 రోజులు ప్రతి రోజు సాయంత్రం నగరోత్సవాలు నిర్వహించనున్నారు. . 22న శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో దుర్గామాత భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 23న శ్రీ గాయత్రిదేవిగా, 24న శ్రీ అన్నపూర్ణ దేవి రూపంలో భక్తులకు కనువిందు చేయనున్నారు. 25న శ్రీ కాత్యాయినిదేవి , 26న శ్రీ మహా లక్ష్మీ దేవి అలంకారం దర్శనం ఇవ్వనున్నారు. 27న శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి, 28న శ్రీమహా చండీదేవి 29న మూలా నక్షత్రం రోజున శ్రీ సరస్వతి దేవిగా భక్తులను కనువిందు చేయనున్నారు. 30న శ్రీ దుర్గా దేవి అలంకారం, అక్టోబర్ ఒకటిన శ్రీ మహిషాసుర మర్దిగా, రెండున అనగా విజయదశమి రోజున శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో కనువిందు చేయనున్నారు. ఈ 11 రోజులు అమ్మవారు ఆయా రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆ సమయంలో అర్చక సభలు, వేద సభలు నిర్వహిస్తారని ఈవో తెలిపారు

## శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ వీ నారాయణన్

తిరుమల,ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ మంగళవారం నాడు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. తరువాత అయన మీడియాతో మాట్లాడారు. చాలా ముఖ్యమైన నిసార్ (నాసా- ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ ) శాటిలైట్ ను లాంచ్ చేయబోతున్నాం. ఇందులో రెండు ముఖ్యమైన పేలోడ్స్ ఉంటాయి. ఈ శాటిలైట్ ను ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించారని అన్నారు. జీఎస్ఎల్వీ మార్క్-2 రాకేష్ ద్వారా ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్నాం. బుధవారం ఉదయం 5.40 నిమిషాలకు ఈ ప్రయోగం జరగనుంది. భూ ఉపరితలం పరిశీలన, ఉపద్రవాల హెచ్చరికలు, అనేక రకాలుగా ఈ శాటిలైట్ ఉపయోగపడనుంది. 12 రోజుల్లో భూమి మొత్తము చుట్టేస్తుంది. శాటిలైట్ ద్వారా వచ్చే డేటా ను గ్లోబల్ కమ్యూనిటీ వెల్ఫేర్ కు ఉపయోగపడుతుందని వెల్లడించారు.

## శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కందుల దుర్గేష్

తిరుమలఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. తరువాత మంత్రి మాట్లాడుతూ సింగపూర్ లో ఏపీ బ్రాండ్ ను పెంచే ప్రయత్నం చేస్తున్న సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతం కావాలి. వైసీపీ హయాంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినింది. ఇతర రాష్ట్రాల నుంచి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు భయపడ్డారని అన్నారు.పారిశ్రామిక వేత్తలు రాష్ట్ర అభివృద్ధికి తోత్పడుతాం అంటే పూర్తిగా మద్దతు ఇస్తాం అనే ప్రయాణం సీఎం చేస్తున్నారు. 2 తేదీ గండికోటను కేంద్ర నిధులతో పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చూడతం. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో సంబంధించిన పర్యాటక ప్రాంతాలపై సమీక్ష తిరుపతి వేదికగా నిర్వహిస్తాం. తిరుపతి, శ్రీశైలం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు, ఎకో టూరిజం, వెల్నెస్ టూరిజం, అడ్వెంచర్స్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ టూరిజం ఏర్పాటు చేసి రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.


# హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు సాంకేతిక సమస్య వలన మూడు రోజుల నుండి సేవలు బంద్...

## విద్యార్థులు వృద్ధులు మహిళలు వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారు



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 29 మంగళవారం డోన్ హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు వినియోగదారుల ఫిర్యాదు మేరకు పోస్ట్ ఆఫీస్ ను సందర్శించడం జరిగినది మూడు రోజుల నుండి రిజిస్టర్ పోస్టులు ఆధార్ ఎన్రోల్మెంట్ సెంటర్ క్యాష్ కౌంటర్స్ పొదుపు బీమా తదితర సేవలు సాంకేతిక ప్రాబ్లం వలన వినియోగదారులకు సేవలు నిలిచిపోయాయని వినియోగదారులు ఫిర్యాదు చేయడం జరిగినది. ఫిర్యాదుదారుడు వెంకటేశ్వరుల గౌడు సేగు హరినాథ్ శెట్టి గత మూడు రోజుల నుండి ప్రతిరోజు రిజిస్టర్ పోస్టుల రూపంలో పోస్ట్ ఆఫీస్ నకు రావడం జరుగుతుందని తమరి పనులు అన్ని విడిచిపెట్టి రావడం వలన ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు కరెంటు పోతే కూడా జనరేటర్ పనిచేయడం లేదని గత కొద్ది సంవత్సరాల నుండి పోస్టల్ సూపర్డెంట్ కి ఎన్నో వినతి పత్రాలు అందించామని ఇంతవరకు జనరేటర్ ని రిపేర్ చేయించలేదని వెంటనే జనరేటర్ కూడా రిపేరు చేయించాలని కోరుతూ సాంకేతిక ప్రాబ్లంను వెంటనే పోస్టుల అధికారులు పరిష్కరించి వినియోగదారులకు సేవలను అందించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి (ఈరన్న) శాశ్వత నిత్యాన్నదాన పథకం కొరకు భక్తుల విరాళం..



కౌతాళం విభారే న్యూస్ జూలై 29..మంగళవారం రోజు శాశ్వత నిత్య అన్నదాన పథకం కొరకు కర్నూలు వాస్తవ్యులైన టి.శివరామ కృష్ణయ్య శెట్టి ? 50,000 రూపాయలు విరాళముగా చెల్లించి ఉన్నారు. వారికి దేవస్థానం వారు శ్రీ స్వామివారి శేష వస్త్రములు, లడ్డు ప్రసాదములు, బాండ్ పేపర్ ఇచ్చి పూలమాలతో సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు జె.లోకరాజ్ స్వామి మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# రాత్రి వేళ గస్తీ పటిష్టం..





విభారే న్యూస్ కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 29.. లాడ్జిలలో ఆకస్మిక తనిఖీలు.రాత్రి గస్తీని పటిష్టం చేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పోలీసు అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ ని పటిష్టం చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత లాడ్జిలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.అనుమానం వ్యక్త పరిచిన వారి వివరాలను ఆరా తీశారు.లాడ్జిలలో రాత్రి బస చేసే వ్యక్తులగుర్తింపుకార్డులుతీసుకొనివివరాలునమోదు చేయాలన్నారు. పరిసరాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని లాడ్జీల యజమానులు పోలీసులకు సహకరించాలని సూచించారు.రాత్రి వేళల్లో ఎటువంటి నేరాలు జరగకుండా రాత్రి గస్తీని పటిష్ట చేశారు.

# రంగారెడ్డి జ్ఞాపకార్థం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం...





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 29 న్యాయవాద వృత్తిలో డోన్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, సేవా సహృదయులు స్వర్గీయ కె.బి.యం రంగారెడ్డి సేవలు ఎనలేనివని డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం భాస్కర్ నాయుడు, సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం నాడు రంగారెడ్డి 17 వ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి కుటుంబ సభ్యులు స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన చేయించి వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వందలాది మంది పల్లె ప్రజల ఆకలి తీర్చారు. అనంతరం కోర్ట్ ఆవరణలో లాయర్లకు, కోర్ట్ సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు, కోర్ట్ సిబ్బంది రంగారెడ్డికి నివాళులు అర్పించారు. ఆసుపత్రిలో అన్నదానం చేసిన రంగారెడ్డి కుమారుడు మహిపాల్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ హనీఫ్ అభినందించారు. ఈ కార్యక్రమంలోసీనియర్ న్యాయవాదులు యస్.టి హరుణ్, శేషశయనరావు మధుసూదన్ రెడ్డి, జూనియర్ లాయర్లు, కోర్ట్ సిబ్బంది, స్ఫూర్తి సభ్యులు స్ఫూర్తి మధు, రాజు యాదవ్, వసంత్ గౌడ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు

# ఇంటి స్థలాల హామీ మరిచిన ముఖ్యమంత్రి... సిపిఎం





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 29 ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ఇల్లు లేని నిరుపేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం దాటిపోయిన పేదలకు ఇచ్చిన హామీ మరచి రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను కారు చౌకగా బడా కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పచెప్పుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ ఆరోపించారు. మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పట్టణంలోని పేద ప్రజలతో ఎమ్మార్వో కార్యాలయం ముట్టడించడం జరిగింది.ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేదలు వేలాది మంది డోన్ పట్టణంలో ఉన్న ఇండ్లకు అద్దెలు కట్టలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఎన్నికలకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి పేదలకు రెండు సెంట్లు స్థలం ఇస్తామన్న హామీని నమ్మి కూటమి ప్రభుత్వాన్నికి పేద ప్రజలు ఓట్లు వేసి అధికారం ఇచ్చారని వారు తెలిపారు. అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయడం లో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వ భూములను కారు చౌకగా ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీల పెట్టుబడిదారులకు కారు చౌకగా ధారా దత్తం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి అధికారంలోకి రాకముందు ఒక మాట అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని వారన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయవలసిన బాధ్యత కలిగిన స్థాయిలో ఉన్న అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతి విమర్శలతో ప్రజల గొంతుకలను నొక్కలనే ప్రయత్నం చేయడం వారి అవివేకానికి నిదర్శనమని వారన్నారు.ఇప్పటికైనా పేద ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలను సమీకరించి ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు చిన్న రహిమాన్, శివరాం,భాస్కర్ రెడ్డి, నాగమద్దయ్య,ఐద్వా నాయకురాలు షమీం బేగం, సిరినా,సూర్య పద్మ,షబానా, చాముండేశ్వరి,మాధవి, భూలక్ష్మి,లక్ష్మీదేవి,విద్యార్థి యువజన సంఘం నాయకులు నక్కి హరి,అశోక్, కెవిపిఎస్ నాయకులు రాజ్ కుమార్,ఖాదర్ వలీ లతోపాటు ఇల్లు లేని 250 మంది నిరుపేదలు పాల్గొనడం జరిగింది.అనంతరం పేద ప్రజలు తీసుకువచ్చిన ఇండ్ల స్థలాల అర్జీలను డిప్యూటీ తాహసిల్దార్ సునీల్ రాజు కి అందించడం జరిగింది.

# భవిష్యత్తుకు సహకార సంఘాలు పునాది లాంటివి :జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 29-మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికి సహకార సంఘాలు పునాది లాంటివని జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని విసి హాల్ నందు జిల్లా కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ....నంద్యాల జిల్లాలో 56 కో-ఆపరేటివ్ సొసైటీలు ఉన్నాయన్నారు.సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రతి గ్రామానికి సొసైటీ సేవలు అందించాలన్నారు. ఇందులో ముఖ్యంగా నాబార్డు, డిసిసిబి లు ఫైనాన్షియల్ గా సపోర్ట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ గోడౌన్స్ రైతుల అవసరం మేరకు ఇవ్వాలన్నారు.జిల్లాలో పండిస్తున్న పంటలకు అనవసరంగా యూరియా వాడకూడదని యూరియా ఎక్కువగా వాడటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఒక ఎకరాకు రెండు బ్యాగులు మాత్రమే యూరియా వాడాలని అధిక మోతాదులో యూరియా వాడినట్లయితే పంట దిగుబడి తగ్గిపోయి ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రామాంజనేయులు, నాబార్డు డిడిఎం కార్తికేయ, డిసిసిబి శివలీల, జెడి ఫిషరీస్, జెడి పశు సంవర్ధక శాఖ, తదితరులు పాల్గొన్నారు.



# చికెన్ సిండికేటర్లను హెచ్చరించిన డిఎస్పి....



విబారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 29 డోన్ పట్టణంలో ఇటీవలే చికెన్ వ్యాపారులు సిండికేట్ అయి ఒకే ధరకే ప్రజలకు అమ్మాలని, తక్కువ ధరకు అమ్మేవారిపై ఒత్తిడి తేవడం జరిగింది. ఈ క్రమంలోనే డోన్ డిఎస్పి శ్రీనివాస్ పట్టణంలోని చికెన్ వ్యాపారులు వారికి నచ్చిన తక్కువ ధరకు ప్రజలకు విక్రయించవచ్చుకోవచ్చని, అలాకాకుండా తాము చెప్పిన ధరలకే విక్రయించాలని వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# రెండు రోజులపాటు విద్యుత్ అంతరాయం...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 29 బుధవారం మరియు గురువారం జులై 30,31 తేదీలలో డోన్ మండలంలోని డోన్ టౌన్ సబ్ స్టేషన్ పరిధిలో లెవెన్ కె.వి వెంకటాపురం ఫీడర్ ఫీడర్ కింద రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో 11 కె.వి లైన్ పనులు జరుగుతున్నందున అబ్బిరెడ్డిపల్లి, వెంకటాపురం గుమ్మకొండ, బొంతిరాళ్ల గ్రామాలకు ఉదయం 10గంటలనుంచిసాయంత్రం6గంటలవరకు కరెంటు అంతరాయం ఉంటుందని అలాగే రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంట్ తెల్లవారుజామున (రాత్రి)3 గంటల నుంచి 10 గంటల వరకు మరియు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందని విద్యుత్ డిప్యూటీ ఇంజనీర్ నాగేంద్ర మరియు రూరల్ ఏఈ నాగేశ్వర రెడ్డి తెలియజేశారు. ప్రజలు సహకరించవలసిందిగా కోరడమైనది.

# మృతుడి కుటుంబానికి బీమా రూ.4.75 లక్షల లు అందచేత...



విభారే న్యూస్ జూలై 29 ఎమ్మిగనూరు..పట్టణంలోని అనారోగ్యంతో మృతి చెందిన గొల్ల అనిల్(48) భార్య జి. ఉమకు రూ. 4.75 లక్షల ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ భీమా మొత్తాన్ని ఆదోని బ్రాంచ్ మేనేజర్ సీఆర్. రామానుజమ్ మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా లైఫ్ ఇన్సూరెన్సు ఆదోని బ్రాంచ్ మేనేజర్ సీఆర్.రామానుజమ్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన గొల్ల అనిల్ 2023లో కేవలం రూ. 5 వేలు చెల్లించి సరళ స్వధన్ పాలసీ తీసుకున్నాడని తెలిపారు. గొల్ల అనిల్ ఆనారోగ్యంలో 2024 మార్చి 1వ తేదిన మృతి చెందాడని చెప్పారు. మృతుడు చేసి రూ.5 వేల పాలసీకి ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్కు మొత్తం రూ.4,75,000 బీమా చెక్కు భార్యకు అందచేయటం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరికి కుటుంబానికి అండగా ఉండేందుకు ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించుకుంటే మంచిదని పేర్కొన్నారు. మేనేజర్తో పాటు ఇన్సూరెన్స్ సిబ్బంది మాలముని, వెంకటేష్, చంద్ర తదితరులు ఉన్నారు.

# బాధ్యత వదిలేశారు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 29-అది రహదారి అని ఆ మూగ జీవాలకు తెలియదు. సేద తీరేం దుకు రహదారిపై పడు కున్నాయి. అయితే అప్ప టికే సాయంత్రం 7 గంటలు అయ్యింది. వర్షా కాలం నేపథ్యంలో త్వరగా చీకటి పడుతుంది. పేరుకే రహదారైనా విద్యుత్తు దీపాల వెలుగులు సరిగ్గా లేవు. నల్ల దూడలు చీకటిలో కలిసిపోతే వేగంగా వెళ్లే వాహ నాలకు అవి కనిపించక ఘోరం తప్పదు. ఈ పరిస్థితులు అనేక మార్లు ఎస్ బి ఐ సర్కిల్. శిల్పా సహకార్ వద్ద రహదార్లపై చోటు చేసుకొన్నాయి. వాటి కాపరులు మాత్రం బాధ్యత మరచి వదిలేస్తున్నారు. ప్రమాదానికి గురై అవి మరణించినా, గాయపడిన సందర్భాల్లో మాత్రం వాహన యజమానులపై దౌర్జన్యం చేసి నగదు వసూలు చేసుకొంటున్నారు. దీనిపై మున్సిపల్. పోలీసు అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని పట్టణ వాసులు పేర్కొంటున్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190